బ్రహ్మసూత్రాణి

ప్రథమోఽధ్యాయః

Table of Contents

1–4 జిజ్ఞాసాత్ సమన్వయాధికరణమ్ 1

5 ఈక్షత్యధికరణమ్ 6

6 ఆనన్దమయాధికరణమ్ 15

ప్రథమాధ్యాయే ప్రథమః పాదః

స్పష్టబ్రహ్మలిఙ్గయుక్తమ్

1–4 జిజ్ఞాసాత్ సమన్వయాధికరణమ్

1.1.4 తత్తు సమన్వయాత్

పూర్వపక్షి: సర్వజ్ఞం, సర్వశక్తిమంతం, జగదుత్పత్తిస్థితిలయకారణం అయిన బ్రహ్మ వేదాంతశాస్త్రాల ద్వారా మాత్రమే తెలియబడేది అని ఎలా చెప్తున్నావు?

వేదాంతవాక్యాలన్నీ సమన్వయం చేసుకుంటే ఇదే విషయం తెలుస్తుంది. 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్', 'ఏకమేవాద్వితీయమ్', 'ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్', 'అయమాత్మా బ్రహ్మ' మొదలైనవన్నీ అదే చెప్తున్నాయి. బ్రహ్మాత్మభావన 'తత్త్వమసి' అని చెప్పే శాస్త్రవాక్యాల ద్వారానే తెలుస్తుంది. ప్రత్యక్షాది ప్రమాణాల ద్వారా తెలియబడదు.

పూర్వపక్షి: బ్రహ్మ శాస్త్రం చేత తెలియబడేదని ఒప్పుకున్నా కూడా, శాస్త్రమెప్పుడూ విధినిషేధాలే చెప్తుంది. ఈ పని చేస్తే ఇది కలుగుతుందని చెప్పినట్టే, ఈ పని చేస్తే మోక్షం కలుగుతుంది అని చెప్తుంది. కాబట్టి, తెలుసుకోవడం అన్న పనికి బ్రహ్మ విషయం కదా?

సిద్ధంతి: ధర్మజిజ్ఞాస వేరు, బ్రహ్మజిజ్ఞాస వేరు. ధర్మజిజ్ఞాస లేనిదాన్ని కొత్తగా సంపాదించడం గురించి చెప్తుంది, బ్రహ్మజిజ్ఞాస ఉన్నవస్తువును గురించి చెప్తుంది. ఉన్నవస్తువు గురించి ఏమీ చేయవలసిన పనిలేదు. కాబట్టి కర్మతో పనిలేదు. కర్మే లేనప్పుడు దానికి అంగం అవ్వడం అన్న ప్రశ్న లేదు.

కర్మ గురించి తెలుసుకోవడం వల్ల కలిగే ఫలితం, బ్రహ్మను తెలుసుకోవడం వల్ల కలిగే ఫలితాలు వేరు. కర్మమార్గంలో విధి నిషేధాలు ఉంటాయి. బ్రహ్మ పట్టుకోవలసింది, వదలవలసింది కాదు. కర్మమార్గంలో చేయమన్నవి తెలుసుకుని చేయడంవల్ల, వద్దన్నవి తెలుసుని మానుకోవడం వల్ల ఆయా ఫలాలు కలుగుతాయి. బ్రహ్మను గురించి తెలుసుకోవడమే ఫలం. కర్మలవల్ల కలిగే ఫలితాలు ఏదో ఒక సమయానికి నశిస్తాయి. బ్రహ్మమే ఫలం. దానికి నాశం లేదు. కర్మ ఫలాల్లో ఎక్కువతక్కువలు ఉంటాయి. బ్రహ్మం అన్న మోక్షఫలం ఒకటే. అది అందరికీ సమానం. కర్మలో చేసే వాడిలో ఎక్కువతక్కువలు ఉండొచ్చు. మోక్షఫలం సాధించే వారందరూ సమానం. కర్మవల్ల కలిగే సుఖదుఃఖ ఫలితాల్లో ఎక్కువతక్కువలు ఉండొచ్చు. మోక్షసుఖం అన్న ఫలం సమం. శరీరం ఉన్నవాడికి ప్రియాప్రియాలు, కామక్రోధాలు ఎప్పుడూ తొలగిపోవు. అశరీరమైతే ప్రియాప్రియాలు తాకవు అని వేదం చెబుతున్నది. అశరీరత్వం అంటే మరణం కాదు. మోక్షం. అది ఏ శరీరాలవల్లా, శరీరాలతో చేసే కర్మలవల్ల సాధించేది కాదు. శరీరాలపైన అభిమానం లేకపోవడమే మోక్షం.

పూర్వపక్షి: ధర్మకార్యాలతో అశరీరత్వాన్ని పొందవచ్చేమో?

సిద్ధాంతి: కర్మలు చేయడానికి శరీరాలు కావాలి. కాబట్టి కర్మలు ఉన్నంతవరకు జన్మలు తప్పవు. మోక్షం అంటేనే శరీరాల్లో నుండి విడుదల. కాబట్టి కర్మ మార్గంలో మోక్షం కలగడం అన్నది ఉండదు. కర్మలతో సాధించేవి అనిత్యాలు. మోక్షం నిత్యం అని వేదం చెబుతున్నది. కాబట్టి కర్మలతో మోక్షం సాధించలేము.

అలా సాధించేది అనిత్యం అవుతుంది. అది ఇంకేదైనా కావచ్చు, మోక్షం మాత్రం కాదు. మిథ్యాజ్ఞానం తొలగితే మోక్షం కలుగుతుంది. మిథ్యాజ్ఞానం తొలగించుకోవడానికి కర్మలు చేయవచ్చు. అందుకోసం వేదం కర్మలు చెప్పి ఉండవచ్చు. వాటికి బ్రహ్మ అంగం కాదు. మోక్షం పురుషతన్త్రం కాదు, వస్తుతన్త్రం. ప్రత్యక్షాది ప్రమాణాలవల్ల వల్ల తెలిసేది కాదు. ఎందుకంటే బ్రహ్మ దేనికీ విషయం కాదు. మోక్షాన్ని సంస్కారాలవల్ల కూడా సాధించలేము.

పూర్వపక్షి: మరి ఉపాసన ఎందుకు చెప్తుంది వేదం?

సిద్ధాంతి: ద్వైతభావం తొలగేందుకు ఒకసారి బ్రహ్మాత్మైకత్వభావన కలిగిన తర్వాత ద్వైతభావన ఉండదు. అప్పుడు ఉపాసనతో పని లేదు. అంతవరకు బ్రహ్మను తెలుసుకోవడానికి శాస్త్రమే ప్రమాణం.

పూర్వపక్షి: మరైతే ఆత్మా ద్రష్టవ్యః, శ్రోతవ్యః మొదలైన విధిలాగా కనిపించే వాక్యాలను ఏదో పని అప్పచెబుతున్నట్టు ఎందుకు చెపుతుంది వేదం?

సిద్ధాంతి: భ్రాంతివల్ల కలిగిన ఈ సంసారిత్వం తొలగింపచేసుకోవలసిందని చెప్పడం కోసం. బహిర్ముఖంగా ఉన్నవాళ్ళకు స్వాభావికమైన ప్రవృత్తులలోనుండి, విషయాలలోనుండి విముఖులను చేయడం కోసం. బహిర్ముఖంగా ఉండి కూడా మోక్షం గురించి ఆలోచిస్తున్నవాళ్ళకు ఆత్మాన్వేషణ చేయమని ఉపదేశిస్తూ, ఇది ద్రష్టవ్యం, శ్రోతవ్యం, మన్తవ్యం, అని కర్తవ్యబోధ చేస్తుంది. ఆ పని చేస్తున్నవారికి 'అయమాత్మా బ్రహ్మ' అని ఆత్మతత్త్వాన్ని చెప్తుంది.

పూర్వపక్షి: ఊరికే ఉన్నవస్తువు గురించి చెప్పినంత మాత్రాన సంసారిత్వం తొలగట్లేదు కదా?

సిద్ధాంతి: అయితే విన్నది సరిగ్గా అర్థం కాలేదని అర్థం చేసుకోవాలి. బ్రహ్మాత్మభావం కలిగితే దేహాత్మభావం ఇక ఉండదు. దేహాభిమానం ఇంకా ఉన్నదంటే బ్రహ్మాత్మభావం కలగలేదని తెలుసుకోవాలి. ఆ రెండు పరస్పర విరుద్ధం.

పూర్వపక్షి: శ్రవణమాత్రాన బ్రహ్మభావం కలిగితే, దాని తర్వాత మనన, నిధిధ్యాసలెందుకు చెప్పింది మరి వేదం? బ్రహ్మను ఆ కర్మకు భాగంగానా?

సిద్ధాంతి: లేదు అవి కూడా శ్రవణం లాగానే పనికొస్తాయి. వేదాంతవాక్యాలన్నీ బ్రహ్మను స్వతంత్రంగానే ప్రతిపాదిస్తాయి. కర్మకు అంగంగా కాదు. బ్రహ్మ దేనికీ విషయం కాదు.

పూర్వపక్షి: బ్రహ్మ దేనికీ విషయం కాకపోతే మరి శాస్త్రం వల్ల తెలియబడుతుందని ఎలా చెప్తున్నావు?

సిద్ధాంతి: శాస్త్రం అవిద్యచేత కల్పించబడ్డ భేదభావాన్ని ఎలా తొలగించుకోవచ్చు అని చెప్తుంది. బ్రహ్మ ఇలా ఉంటుందని చూపించలేదు. ప్రత్యగాత్మగా బ్రహ్మ అవిషయం. మోక్షాన్ని త్రికరణాలతో కానీ, ఉత్పాద్యం, వికార్యం, ఆప్యత్వం, సంస్కార్యం అన్న పద్ధతులవల్ల కానీ సాధించలేము. ఎప్పుడూ ఉండేది కాబట్టి ఉత్పత్తి చేయలేము. పుట్టిస్తే మరణిస్తుంది. నశించేది కాదు కాబట్టి మార్పులతో తయారుచేసుకోలేము. మారిస్తే నశిస్తుంది. అంతటా ఉండేదాన్ని ఎక్కడ్నుంచో

తెచ్చుకోలేము. లోటు భర్తీ చేద్దామంటే అది పరిపూర్ణం. అందులోనుండి అక్కర్లేనిది తీసి వాడుకుందాం అంటే అది పరిశుద్ధం. దాన్ని పట్టుకోవడం వదిలిపెట్టడం అన్నవి లేవు. అందుకని ఏ కర్మలవల్ల, క్రియలవల్లా మోక్షం కలుగదు. కేవలం జ్ఞానం వల్ల మాత్రమే మోక్షం.

పూర్వపక్షి: జ్ఞానం కూడా మానసిక క్రియ కదా?

సిద్ధాంతి: తేడా ఉంది. ఒకరు చెప్పిన/చూపించిన విధంగా చేసే ధ్యానం, మననం మొదలైనవి మానసిక కర్మలు. అయితే విన్నవాడు వాటిని అలాగే చేయవచ్చు, మానుకోవచ్చు, వేరే విధంగా చేయవచ్చు. అవి పురుషతన్త్రం, చోదనాతన్త్రం. అర్థం అవ్వడం అన్నది ఈ రెండు కాదు. అది వస్తుతన్త్రం. అటువంటి జ్ఞానం క్రియకాదు. అట్లానే ఉన్న బ్రహ్మపదార్థాన్ని ఉన్నట్టు తెలుసుకోవడం అన్న జ్ఞానం క్రియ కాదు, తెలుసుకోవడం అన్న జ్ఞానం. ఇది సూక్ష్మమైన భేదం. జాగ్రత్తగా అర్థం చేసుకోవాలి.

పూర్వపక్షి: అహం అని అందరికీ తెలుస్తూనే ఉన్నది కదా? ఉపనిషత్తుల్లో మాత్రమే తెలుస్తుందని ఎందుకు చెప్తున్నావు?

సిద్ధాంతి: నేను అని నీకు తెలుస్తున్నది నువ్వు కాదు. అది అహంకారం. నీకు నువ్వు తెలిసే అవకాశం లేదు. నీకు నువ్వు విషయం కాదు. కాబట్టి ప్రత్యక్షాది ఇతర ప్రమాణాల వల్ల అది తెలియదు. ఎందుకు తెలియట్లేదు, ఎందుకు తెలియదు అన్న విషయం అర్థమయ్యేంతవరకు వేదాన్ని ప్రమాణంగా పెట్టుకుని ప్రయత్నం చేయాలి. అంతవరకూ శాస్త్రమే ప్రమాణం.

5 ఈక్షత్యధికరణమ్

సాంఖ్యులు సర్వ వేదాన్తవాక్యాలు సృష్టికి ప్రధానమే కారణమని, ప్రధానపురుషసంయోగం వల్లనే సృష్టి జరుగుతుందని చెప్తున్నాయంటారు. కాణాదులు ఇవే వేదాంతవాక్యాలు ఈశ్వరుడే నిమిత్తకారణమని, అణువులు సమవాయికారణం అని చెప్తున్నాయంటారు. తార్కికులు వాక్యాభాసలతో, యుక్త్యాభాసాలతో పూర్వపక్షులుగా ఇవే వేదాంతవాక్యాలతో వాదిస్తుంటారు. పదవాక్యప్రమాణజ్ఞుడు, బాదరాయణాచార్యులు పూర్వపక్షులు తెస్తున్న ఈ వాదనలను త్రోసిపుచ్చుతూ వేదాన్తవాక్యాలన్నీ బ్రహ్మమే పరమావధిగా చెప్తున్నాయని నిరూపిస్తున్నారు.

1.1.5 ఈక్షతేర్నాశబ్దమ్

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: మీరు వేదాన్తవాక్యాలు సర్వజ్ఞం, సర్వశక్తి అయిన బ్రహ్మ జగత్కారణం అంటున్నారు కానీ అచేతనమైన ప్రధానమే జగత్కారణం అని చెప్తున్నాయి.

సిద్ధాంతి: కాదు. అచేతనమైన ప్రధానం జగత్కారణమన్నది సాంఖ్యులు కల్పించింది. వేదాన్తాల్లో ఇలా చెప్పబడి ఉన్నదని చెప్పడం అశబ్దం.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: ఎందుకు అశబ్దం?

సిద్ధాంతి: ఈక్షతి అని చెప్తున్నది కాబట్టి.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: అయితే?

సిద్ధాంతి: 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్' నుండి 'తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి తత్తేజోఽసృజత' వరకు ఇదం అని చెప్తున్నది జగత్ గురించి. ఇక్కడ ఈక్షణ పూర్వకంగా చెప్పిన తత్ శబ్దం సత్ గురించి. 'ఆత్మా వా ఇదమేక ఏవాగ్ర ఆసీత్। నాన్యత్కిఞ్చన మిషత్। స ఈక్షత లోకాన్ను సృజా ఇతి। స ఇమాంలోకానసృజత', 'స ఈక్షాఞ్చక్రే। స ప్రాణమసృజత', 'యః సర్వజ్ఞః సర్వవిద్యస్య జ్ఞానమయం తపః। తస్మాదేతద్బ్రహ్మ నామ రూపమన్నం చ జాయతే' మొదలైన వేదాంతవాక్యాలన్నీ సర్వజ్ఞుడైన ఈశ్వరుడే సృష్టికి కారణమని ఉదహరిస్తున్నాయి.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: ఇవే వేదాంతవాక్యాలు అచేతనమైన ప్రధానమే కారణమని చెప్తున్నాయని నిరూపించగలం.

సిద్ధాంతి: ఎలా?

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: 'సత్త్వాత్సంజాయతే జ్ఞానం' అని భగవద్గీత చెప్పినట్టు జ్ఞానం సత్త్వగుణం యొక్క ధర్మం. ఆ సత్త్వధర్మమైన జ్ఞానంతో కార్యకారణాలతో కూడిన మనుషులు సర్వజ్ఞులు, యోగులు అని తెలిసినదే కదా? సత్త్వం పైకొస్తేనే సర్వ విషయాల గురించిన జ్ఞానం కలుగుతుందని కూడా చూస్తుంటాం కదా? పురుషుడు తనపాటికి తాను ఏ గుణాలు, కర్మలు లేకుండా ఉంటే, సర్వజ్ఞం కిఞ్చిజ్జ్ఞం అని ఎలా చెప్తాం? త్రిగుణాలతో ఉన్న ప్రధానంలో సర్వజ్ఞానానికి కారణమైన సత్త్వం ప్రధానంగా ఉంటుంది కాబట్టి సర్వజ్ఞత్వం ప్రధానానికే ఉంటుంది. పైగా సృష్టికి పూర్వం ఏ ఉపాధులు లేని బ్రహ్మలో సత్త్వగుణం కూడా ఉండదు. అప్పుడు జ్ఞానసాధనాలయిన శరీరేన్ద్రియాదులు కూడా ఉండవు.

అందుకని జ్ఞానం కలిగే అవకాశమే లేదు. అందుకని ప్రధానమే సర్వజ్ఞం, సర్వశక్తి, సృష్టికారణం.

సిద్ధాంతి: అది కుదరదు. సత్త్వంతో పాటు ప్రధానంలో ఇంకా రెండు గుణాలు కూడా ఉంటాయి. అవి జ్ఞానాన్ని నిరోధిస్తుంటాయి. సామాన్యావస్థలో అన్నీ ఒకే స్థితిలో ఉంటాయి. ఈ రెండు విధాలుగా కూడా ప్రధానం సర్వజ్ఞం కాలేదు. కావాలంటే కిఞ్చిజ్జ్ఞం అవ్వచ్చు. పైగా సత్త్వగుణంతో జ్ఞానం ఉన్నా కూడా, చూసే సాక్షి లేకుండా జ్ఞానం ప్రవర్తించలేదు. ప్రధానం సాక్షి కాదు. అందుకని సాక్షి అయిన బ్రహ్మమే సర్వజ్ఞం. యోగుల్లో కూడా రజోతమోగుణాలు పూర్తిగా అణిగిపోయి సత్త్వం మాత్రం పైకొచ్చి ఉన్నప్పుడు వారు చైతన్యవంతులై ఉంటారు. అప్పుడు వారిని సర్వజ్ఞులంటారు. ఆ విధంగా చూసినా కూడా అచేతనమైన ప్రధానం సర్వజ్ఞం కాలేదు.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: బ్రహ్మ విషయంలో కర్మ ప్రవర్తించదని చెప్పారు, మరి జ్ఞానం ఉంటే కర్మచేయవలసి వస్తుంది కదా? అప్పుడు కర్మతో సంబంధం ఉంటుంది కదా? పైగా మీరు చూపించిన ఉదాహరణల్లో తదైక్షత అది చూసింది, అనుకున్నది అని ఉన్నాయే? అవి కర్మలు కావా?

సిద్ధాంతి: లేదు. సూర్యుడు తపింపచేస్తున్నాడు, ప్రకాశిస్తున్నాడు అంటే అది దాని లక్షణం. ప్రత్యేకంగా చేస్తున్నపని కాదు. తెలుసుకోవడం సర్వజ్ఞం, సాక్షి అయిన బ్రహ్మానికి నిత్యసిద్ధమైన లక్షణం.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: ఉపాధిలేకుండా అశరీరుడైన బ్రహ్మ ఎలా తెలుసుకోగలడు?

సిద్ధాంతి: అవిద్యావంతుడైన సంసారికి జ్ఞానార్జనకు శరీరాది ఉపాధుల అవసరం ఉంటుంది. జ్ఞానానికి ఏ అడ్డు లేని ఈశ్వరుడికి ఉపాధులతో నిమిత్తం లేదు. 'న తస్య కార్యం కరణం చ విద్యతే న తత్సమశ్చాభ్యధికశ్చ దృశ్యతే। పరాస్య శక్తిర్వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞానబలక్రియా చ', 'అపాణిపాదో జవనో గ్రహీతా పశ్యత్యచక్షుః స శృణోత్యకర్ణః। స వేత్తి వేద్యం న చ తస్యాస్తి వేత్తా తమాహురగ్ర్యం పురుషం మహాన్తమ్' మొదలైన మంత్రాలన్నీ ఇదే నిరూపిస్తుంటాయి.

పూర్వపక్షం సాఙ్ఖ్యలు: జ్ఞానంతో ఉన్న, జ్ఞానానికీ ఏ అడ్డు లేని ఈశ్వరుడే, అని చెప్తూ అవిద్యావంతుడైన శరీరి అని అంటున్నారు? ఉన్నదంతా ఒకడే అని చెప్తారు మీరు. వేదాంతవాక్యాలు కూడా 'నాన్యోఽస్తి ద్రష్టా నాన్యోఽతోఽస్తి విజ్ఞాతా' అంటుందే? మరి మళ్ళీ సంసారికి జ్ఞానసాధనకు ఉపాధి అవసరం అని ఎందుకు చెప్తున్నారు?

సిద్ధాంతి: అవును నిజమే. ఈశ్వరుడు కాక వేరే ఏదీ లేదు. అయితే దేహాద్యభిమానాలవల్ల, ఉపాధి సంబంధాల వల్ల కలిగే అవివేకం కారణంగా ఈశ్వరసంసారిభేదరూపమైన మిథ్యాజ్ఞానం కలుగుతుంది. వారికి జ్ఞానార్జన, అందుకు ఉపాధుల అవసరం ఉంటుంది.

1.1.6 గౌణశ్చేన్నాత్మశబ్దాత్

పూర్వపక్షం సాఙ్ఖ్యలు: అచేతనమే పురుషుడితో కూడి చేతనవంతమైనట్టుగా వ్యవహరిస్తూ ఈ జగత్తుకు కారణం కావచ్చు కదా? ఏదో గట్టు కూలిపోతున్నది అంటే దానికదే ఆలోచించుకుని చేస్తున్నదని కాదు, కానీ అలా అనిపిస్తుంది

కదా? అలాగే సృష్టిసమయం ఆసన్నమైనప్పుడు చేతనమైన పురుషుడితో కలిసి చేతనం లాగా పని చేస్తుందని అనుకోవచ్చు కదా? అప్పుడు 'తదైక్షత' లో చెప్పిన తత్ ప్రధానమే అనుకోవచ్చుకదా? ప్రధానమే ఈక్షతి అనుకుని మహదాదులతో కలిసి సృష్టి చేస్తూ ఉండవచ్చు కదా?

సిద్ధాంతి: ఏదైనా అనుకోవచ్చు కానీ ఎదురుగా ఉన్న ముఖ్యకారణం బ్రహ్మను వదిలిపెట్టి ఔపచారికంగా ప్రధానం చెప్పుకోవడం ఎందుకు?

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: ఎందుకంటే మీరు చెప్పిన మంత్రాల్లోనే 'తత్తేజ ఐక్షత', 'తా ఆప ఐక్షన్త' అని ఉన్నాయి కదా? ఆ అగ్ని, ఆ నీరు అచేతనం కదా? అందుకని సత్కర్మవాదంతో ఈక్షణ అన్న శబ్దాన్ని ఔపచారికంగా తీసుకుని ప్రధానమే కారణమని చెప్తున్నాం.

సిద్ధాంతి: అగ్ని నీరు లాగా అచేతనమైన ప్రధానం ఔపచారికంగా సచ్ఛబ్దవాచ్యం అని మీరు చెప్పింది అసత్.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: ఎందుకు?

సిద్ధాంతి: అవే వేదాంతవాక్యాల్లో సత్ ను ఆత్మశబ్దం ప్రయోగించినందుకు. 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీత్' అని మొదలుపెట్టి 'తదైక్షత తత్తేజోఽసృజత', అంటూ తేజోఽబన్నాల సృష్టిక్రమం చెప్పి, తత్, ప్రకృతమైన సత్, అదే ఈక్షితృగా చెప్తూ, ఆ తేజోఽబన్నాలను దేవతాశబ్దంతో సంభోదించి, 'సేయం దేవతైక్షత హన్తాహమిమాస్తిస్రో దేవతా అనేన జీవేనాత్మనానుప్రవశ్య నామరూపే వ్యాకరవాణి' అని చెప్పింది. ఇక్కడ ఒకవేళ అచేతనమైన ప్రధానమే అయితే దాన్నే దేవతా అని పిలవవలసి వచ్చేది. ఇక్కడ చెప్పిన దేవత జీవాత్మశబ్దంతో

పిలువబడేది కాదప్పుడు. జీవుడంటేనే చేతనుడు, శరీరాధ్యక్షుడు, ప్రాణాలను ధరించేవాడు అని నిర్వచిస్తారు. అప్పుడు అచేతనమైన ప్రధానం ఆత్మ ఎలా అవుతుంది? ఆత్మ అంటేనే స్వరూపం. అచేతనమైన ప్రధానం చేతనమైన జీవుడి స్వరూపం అవ్వలేదు. అందుకని చేతనం బ్రహ్మ ఈక్షితృశబ్దానికి ముఖ్యార్థంగా తీసుకోవాలి. జీవుడికి ప్రయోగించిన ఆత్మశబ్దాన్ని గౌణార్థంగా, ఔపచారికంగా ప్రధానానికి వాడలేము. అందుకే 'స య ఏషోఽణిమైతదాత్మ్యమిదం సర్వం తత్సత్యం స ఆత్మా తత్త్వమసి శ్వేతకేతో', అన్నచోట 'స ఆత్మా' అన్నది ప్రకృతం, సత్, అణిమను ఆత్మశబ్దంతో చెప్పి, 'తత్త్వమసి శ్వేతకేతో' అని చేతనమైన శ్వేతకేతుకు ఆత్మగా ఉపదేశిస్తున్నారు. అగ్ని లాగా, నీరు లాగా ఏదో కొంచం అటువంటి గుణం, లక్షణం కనిపించినంత మాత్రాన పుర్తిగా గణార్థంతో ఔపచారికంగా అచేతనమైన ప్రధాన్నాన్ని ఆత్మస్వరూపంగా, వీటికి సృష్టికారణంగా చూపరాదు.

1.1.7 తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్

పూర్వపక్షం సాఙ్ఖ్యలు: రాజు కార్యాలు భృత్యుడు చేసినట్టి ఆత్మ కార్యాలు ప్రధానం చేస్తూ ఉండవచ్చు కదా? అప్పుడు నేనైనా నా భృత్యుడైనా ఒకటే నా భృత్యుడంటే నేనే అన్నట్టు ఇక్కడ ప్రధానాన్ని ఆత్మ శబ్దంగా వాడి ఉండవచ్చు కదా?

సిద్ధాంతి: అచేతనమైన ప్రధానం ఆత్మశబ్దానికి అర్థం కాలేదు. 'స ఆత్మా' అని ప్రకృతం సదణిమను తెచ్చి 'తత్త్వమసి శ్వేతకేతో' అని చేతనమైన శ్వేతకేతుకు చెప్తూ, 'ఆచార్యవాన్పురుషో వేద', 'తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యేఽథ

సంపత్స్యే' అని మోక్షోపదేశం చేస్తున్నారు. ఒకవేళ ముముక్షువైన చేతనుడైన వాడికి అచేతనం ప్రధానం సచ్ఛబ్దవాచ్యం నువ్వే అని చెప్తే నేర్పిస్తే, వాడది నమ్మితే చేతనుడైనవాడికి అచేతనం నువ్వని చెప్పినట్టవుతుంది. అప్పుడు శాస్త్రం విపరీతవాది, అప్రమాణం అయి, పురుషుడికి అనర్థహేతువవుతుంది. అలా చెప్తున్నది వేదం అని వాదిస్తే శాస్త్రాన్ని అప్రమాణం చేసిన దోషం కలుగుతుంది. ఒకవేళ అజ్ఞాని, సత్ అయిన ముముక్షువుకు అచేతనమైన అనాత్మను ఆత్మగానే, తన స్వరుపంగానే ఉపదేశిస్తే, వాడది శాస్త్రప్రమాణమని నమ్మితే ఆత్మను పోగొట్టుకుని, అనాత్మను పట్టుకుని, పురుషార్థం చెడగొట్టుకుని, చాలా అనర్థం తెచ్చిపెట్టుకుంటాడు. వేదం ముముక్షువుకు ఆత్మయొక్క ముఖ్యార్థంతో యథార్థతత్త్వాన్నే ఉపదేశిస్తుంది. గౌణార్థంతో కాదు. నేను, భృత్యుడు అని స్పష్టంగా తెలిసినప్పుడు నా భృత్యుడంటే నేనే, నా భృత్యుడు నా ఆత్మే అనవచ్చు. కానీ ఆత్మతత్త్వం యథార్థంగా తెలియనప్పుడు గౌణం వాడరాదు.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: అచేతనమైన దేహాన్ని, ఇంద్రియాలను కూడా భూతాత్మా, ఇంద్రియాత్మా అని ఆత్మశబ్దాన్ని దేహేంద్రియాలకు కూడా ప్రయోగిస్తుంటారు కదా?

సిద్ధాంతి: ఈ ప్రకరణం భూతాత్మ, ఇంద్రియాత్మా చెప్పే ప్రకరణం కాదు. ఆత్మను స్వరూపంగా నిరూపించే మోక్షప్రకరణం. ఇందులో ఔపచారికంగా ప్రధానం మొదలైన వాటన్నింటినీ ఆత్మశబ్దానికి అర్థంగా తీసుకోరాదు. పైగా ఆత్మశబ్దంతో చెప్పబడుతున్నది అచేతనమైన ప్రధానమే అని నిరూపించడానికి ఏ పదాలు ఈ ప్రకరణంలో వాడబడలేదు. అందుకు ఏ ఆధారాలు ఈ ప్రకరణంలో

లేవు. ఇక్కడ "అది ఆత్మ, అది నువ్వే" అని చెతున్నది చేతనమైన శ్వేతకేతుకు. అందువల్ల సత్, తత్, ఆత్మశబ్దాలతో ప్రయోగించింది చేతనవిషయంలోనే అన్నది నిశ్చయం.

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: జ్యోతి అంటే అగ్ని కావచ్చు, అగ్నిష్టోమం అన్న క్రతువు కావచ్చు. ఈక్షతి అంటే గౌణంగా దాన్ని ప్రధానానికి వాడరాదని ఎందుకు చెప్తున్నారు?

సిద్ధాంతి: జ్యోతి అన్న మాట లోకంలో సామాన్యంగా ప్రయోగించినప్పుడు అగ్ని అన్న రూఢ్యర్థమే తీసుకుంటాము. అర్థవాదంతో క్రతువుగా చెప్పాలంటే ఆ చెప్పబడుతున్న ప్రకరణంలో మిగిలిన విషయాలతో కలిపి చూసుకోవలసి వస్తుంది. ఈ దృష్టాన్తం ఇక్కడ పనిచేయదు. ఈ కారణాలకు అచేతనమైన ప్రధానం సచ్ఛబ్దవాచ్యం కాదు.

1.1.8 హేయత్వావచనాచ్చ

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: అచేతనం ప్రధానం సచ్ఛబ్దవాచ్యం కాదని నిరూపించడానికి ఇంకా ఏవైనా వేదాంతవాక్యాలు చూపించగలరా?

సిద్ధాంతి: అలాగే. ఒకవేళ 'స ఆత్మా తత్త్వమసి' అని చెప్పిన చోట ప్రధానం సచ్ఛబ్దవాచ్యంగా ఆత్మస్వరూపంగా ఉపదేశింపబడినట్లైతే, దాంతో పాటే వెంటనే అటువంటిదాన్ని పట్టుకునేవు వదిలిపెట్టవలసి ఉన్నది అని కూడా ఉపదేశించి ఉండేది వేదం. అరుంధతీ నక్షత్రం చూపించవలసి ఉన్నప్పుడు ఆ ప్రక్కనే ఉన్న కొంత సులువుగా తెలిసే నక్షత్రాన్ని ముందు చూపించి, దాన్ని పట్టించిన తర్వాత

అది కాదు, దాని ప్రక్కనే ఉన్నదాన్ని చూడు అని అరుంధతిని చూపించినట్టు. కానీ ఇక్కడ అలా లేదు. సత్ మాత్రంగా ఆత్మను చూపి ఆ ఆరో అధ్యాయాన్ని పుర్తిచేసింది. అందుకని అచేతనమైన ప్రధానం సచ్ఛబ్దవాచ్యం కాదు.

1.1.9 స్వాప్యయాత్

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: అచేతనం ప్రధానం సచ్ఛబ్దవాచ్యం కాదని నిరూపించడానికి ఇంకా ఏవైనా వేదాంతవాక్యాలు చూపించగలరా?

సిద్ధాంతి: 'యత్రైతత్పురుషః స్వపితి నామ సతా సోమ్య తదా సంపన్నో భవతి స్వమపీతో భవతి తస్మాదేనం స్వపితీత్యాచక్షతే స్వం హ్యపీతో భవతి' అన్న వేదవాక్యంలో స్వపితి అంటే తన స్వరూపంలోనే లయమవ్వడం అని చెప్తున్నది. చేతనమైన ఆత్మ అచేతనమైన ప్రధానంలో తన స్వరూపంగా లయమవ్వడం అన్నది కుదరదు.

1.1.10 గతిసామాన్యాత్

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: అచేతనం ప్రధానం సచ్ఛబ్దవాచ్యం కాదని నిరూపించడానికి ఇంకా ఏవైనా వేదాంతవాక్యాలు చూపించగలరా?

సిద్ధాంతి: వేదాంతవాక్యాలు జగత్కారణాన్ని ఒక్కోచోట ఒక్కోలాగా వేరువేరుగా చెప్పదు. ఎక్కడైనా చేతనమైన బ్రహ్మమే జగత్కారణమని చెప్తుంటుంది. 'యథాగ్నేర్జ్వలతః సర్వా దిశో విస్ఫులిఙ్గా విప్రతిష్ఠేరన్నేవమేవైతస్మాదాత్మనః సర్వే ప్రాణా యథాయతనం విప్రతిష్ఠన్తే। ప్రాణేభ్యో దేవా దేవేభ్యో లోకాః', 'తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశః సంభూతః', 'ఆత్మత ఏవేదం సర్వమ్', 'ఆత్మన ఏష

ప్రాణో జాయతే' అని వేదాంతవాక్యాలన్నీ అన్నిచోట్లా సమానంగా ఒకే విధంగా ఆత్మే కారణమని చెప్తుంటాయి. అందుకని జగత్కారణం బ్రహ్మ.

1.1.11 శ్రుతత్వాచ్చ

పూర్వపక్షం సాఙ్ఖ్యులు: అచేతనం ప్రధానం సచ్ఛబ్దవాచ్యం కాదని నిరూపించడానికి ఇంకా ఏవైనా వేదాంతవాక్యాలు చూపించగలరా?

సిద్ధాంతి: 'స కారణం కరణాధిపాధిపో న చాస్య కశ్చిజ్జనితా న చాధిపః' అని స్వశబ్దంతో సర్వజ్ఞుడు ఈశ్వరుడు జగత్కారణం అని చెప్తున్నది. అందువల్ల సర్వజ్ఞుడైన బ్రహ్మ జగత్కారణం, అచేతనమైన ప్రధానమో మరొకటో కాదన్నది సిద్ధం.

6 ఆనన్దమయాధికరణమ్

ప్రశ్న: 'జన్మాద్యస్య యతః' అని మొదలుపెట్టి 'శ్రుతత్వాచ్చ' వరకు చెప్పిన సూత్రాల్లో ఉదహరించిన వేదాంతవాక్యాల్లో బ్రహ్మ సర్వజ్ఞుడు, సర్వశక్తి, ఈశ్వరుడు, ఈ జగత్తు యొక్క జన్మస్థితిలయకారణము అని న్యాయంగా ప్రతిపాదించబడ్డది. అలాగే గతిసామాన్యం అన్న సూత్రం ద్వారా సర్వ వేదాన్తాల్లో చైతన్యమే కారణం అని వ్యాఖ్యానించబడ్డది. ఇక తర్వాత చెప్పవలసినది ఏమున్నది?

జవాబు: వేదం బ్రహ్మను సోపాధికంగా నిరుపాధికంగా రెండు రూపాలుగా ఉన్నట్టు చూపిస్తుంటుంది. ఉపాసనలో కూడా ఉపాధి, ఫల భేదాలతో బ్రహ్మను ఎన్నో రూపాలుగా చూపిస్తుంటుంది.

అందుకని ఆత్మజ్ఞానం ద్వారా మోక్షం గురించి చెప్తూనే ఉపాధి విశేషాలతో చూపించడాన్ని పునరాలోచించుకుని జాగ్రత్తగా నిర్ణయించుకోవలసి ఉన్నది. ఒకటే అయిన బ్రహ్మను ఉపసనతో సోపాధికంగా, జ్ఞానంతో నిరుపాధికంగా వేదం ఉపదేశిస్తూ ఉంటుంది అని చూపించడం కోసం 'ఆనన్దమయోఽభ్యాసాత్' అని మళ్ళీ మొదలుపెట్టుకుంటూ ఉన్నాము. ఇంతకు ముందు 'గతిసామాన్యాత్' అన్న సూత్రంతో బ్రహ్మమే కారణమని నిరూపించినా కూడా, బ్రహ్మ తప్ప వేరేది ఏదీ కాదు అని కూడా నిరూపించవలసి ఉన్నది. ఈ రెండు కారణాలకు తదుపరి గ్రంథం ప్రారంభమౌతున్నది.

1.1.12 ఆనన్దమయోఽభ్యాసాత్

తైత్తిరీయంలో అన్నమయం, ప్రాణమయం, మనోమయం, విజ్ఞానమయం అని చెప్తున్న దానిలో ఆనన్దమయశబ్దంతో చెప్పబడుతున్నది పరబ్రహ్మ గురించేనా లేదా ఇంక దేని గురించైనా చెప్తున్నదా అని సందేహం కలుగవచ్చు.

ప్రశ్న: దానికి సమాధానం ఏమి?

జవాబు: అన్నమయం మొదలైన అముఖ్యాత్మల ఒరవడిలోనే చెప్పడం వల్ల ఇక్కడ ఆనందమయం అముఖ్యాత్మ అవుతుంది. అన్నింటికీ లోపల ఉన్నదని చెప్పడం వల్ల ఆనన్దమయం ముఖ్యాత్మ అవుతుంది. సశరీరం అయితే ప్రియాప్రియస్పర్శ లేకుండా పోదు. ముఖ్యాత్మకు ప్రియాప్రియాలు ఉండవు. 'ఆనన్దమయోఽభ్యాసాత్' అన్న సూత్రాన్ని బట్టి ఆనన్దమయం పరాత్మ అయి ఉండవలసి ఉన్నది.

ప్రశ్న: ఎందుకని?

జవాబు: సూత్రం ‘అభ్యాసాత్’ అన్న పదం వాడింది కాబట్టి. శాస్త్రం ఆనందశబ్దం మాటిమాటికీ పరాత్మ గురించే వాడుతూ ఉంటుంది. అందుకని అన్నమయాది అనాత్మల సమూహంలో పెట్టినా కూడా అన్నింటికీ లోపల ఉన్నది అని చెప్తున్నది కాబట్టి ఆనన్దమయం ముఖ్యాత్మ అవ్వవచ్చు.

ప్రశ్న: అవయవాలు చెప్తున్నందువల్ల ముఖ్యాత్మ కాకపోవచ్చు కదా?

జవాబు: అవయవాలు దానికి స్వాభావికం కాదు. నిజంగా సంసారిలాగా దానికి శరీరం లేదు అందుకని ఆనందమయం పరాత్మే.

1.1.13 వికారశబ్దాన్నేతి చేన్న ప్రాచుర్యాత్

ప్రశ్న: మయం అని వికారం చెప్తున్నది కాబట్టి ఆనందమయం పరాత్మ కాదేమో.

జవాబు: మయం అన్నది ప్రాచుర్యార్థంలో కూడా చెప్పవచ్చు.

1.1.14 తద్ధేతువ్యపదేశాచ్చ

ఆది ఆనందాన్ని ఇస్తూ ఉంటుంది అని చెప్తుంటుంది వేదం. చాలా ఎక్కువగా ఉంటేనే ప్రక్కవాడికి ఇవ్వడం కుదురుతుంది. అందువల్ల ఆనందమయం అంటే ఆనందంతో పూర్తిగా నిండి ఉన్నది అని అర్థం తీసుకోవచ్చు. అందుకని ప్రాచుర్యార్థంతో ఆనన్దమయం అంటే పరాత్మ.

1.1.15 మాన్త్రవర్ణికమేవ చ గీయతే

మంత్రవర్ణం కూడా అదే చెప్తూ ఉంటుంది.

1.1.16 నేతరోఽనుపపత్తేః

పైగా ఈశ్వరుడు కాక వేరే ఎవ్వరూ ఆనందమయులు కారు.

1.1.17 భేదవ్యపదేశాచ్చ

ఆనందం తెలిసినవాడు ఆనందం అవుతాడు అని చెప్తుంది కాబట్టి జీవుడు ఆనందమయుడు కాదని తెలుస్తున్నది.

ప్రశ్న: జీవేశ్వరులకు భేదం లేదని చెప్తూనే మళ్ళీ ఎందుకు వేరు చేసి చూపుతున్నది?

జవాబు: లౌకికో దృష్టితో చూస్తూ ఉన్నవారికి అర్థం అయ్యేలా చెప్పడం కోసం.

1.1.18 కామాచ్చ నానుమానాపేక్షా

ఆనన్దమయ అధికారణంలో 'సోఽకామయత బహుస్యాం ప్రజాయేయ' అని చెప్తున్నది కాబట్టి ఆనందమయం చైతన్యమైన బ్రహ్మ. 'ఈక్షతేర్నాశబ్దమ్' అన్న సూత్రంలో సాంఖ్యులు చెప్పినట్టు అచేతనం ప్రధానం కారణం కాదు అని నిరకరించినా కూడా, 'గతిసామాన్యాత్' అన్న సూత్రంలో చూపించినట్టు ఇంకోసారి గుర్తు చేసుకోవలసి ఉన్నది.

1.1.19 అస్మిన్నస్య చ తద్యోగం శాస్తి

ఆనందమయం అన్న శబ్దం ద్వారా చెప్పబడుతున్నది ప్రధానమో జీవుడో కాదు అని ఇక్కడ మళ్ళీ చూపిస్తున్నారు. జ్ఞానం పొందిన జీవుడు ఆత్మలో చేరిపోతాడు, అజ్ఞానంతో ఏమాత్రం భేదం చూసినా సంసారభయం తొలగదు అని చెప్తూ ఉన్నది. అలా జరగాలంటే పరాత్మను పట్టుకోవాలి. ప్రధానాన్నో, జీవాన్నో కాదు. అందుకని ఆనన్దమయం అంటే పరమాత్మ.

ప్రశ్న: అర్ధజరతీన్యాయంలాగా కొన్ని చోట్ల మయం అన్న శబ్దాన్ని అన్నమయాదులకు వికారార్థంలో, ఆనందమయానికి ప్రాచుర్యార్థంలో ఎలా వాడతారు? అంతటా ఒకే విధంగా వాడవలసి ఉన్నది. అన్నమయాదులన్నీ అయితే బ్రహ్మం అవ్వాలి, లేదా అన్నీ అబ్రహ్మం అవ్వాలి.

జవాబు: పైనపైన ఉన్నందుకు అన్నమయాదులు అబ్రహ్మం, అన్నింటికీ లోన ఉన్నందుకు ఆనన్దమయం బ్రహ్మం అవ్వవచ్చు.

ప్రశ్న: ఆనందమయం అవయవాలు చెప్తూ 'బ్రహ్మ పుచ్ఛం ప్రతిష్ఠా' అన్నది కదా, ఆనందమయానికి బ్రహ్మ ఒక భాగం అయితే బ్రహ్మకు స్వప్రధానత్వం ఎలా ఉంటుంది? అదే అవయవం, అదే అవయవీ అన్నది ఎలా కుదురుతుంది?

జవాబు: అవున్నిజమే. బ్రహ్మం వరకు చెప్పి అక్కడకు ఆపేసింది కాబట్టి ఆనందమయానికే కాదు, పైన ఉన్న అన్ని కోశాలకు బ్రహ్మమే పుచ్ఛం ప్రతిష్ఠా ఆధారమై ఉన్నది. ఈ విధంగా బ్రహ్మకు స్వప్రధానత్వం ఉంటుంది. అందుకని అది ఆనందమయానికి అవయవం అవ్వవలసిన పని లేదు.

ప్రశ్న: మరి ప్రియాప్రియాలు ఉన్నాయన్నారే?

జవాబు: అవి ఉపాధి లక్షణాలు. ఆనందమయాన్ని కూడా కోశంగానే తీసుకుందాం. వేదం ఆనందమయాన్ని మాటిమాటికీ చెప్పట్లేదు. ఆనందం అని చెప్తున్నది. ఆనందమయకోశంతో సహా అన్నింటినీ దాటుతూ వెళ్తే ఈ ఆనందం తెలుస్తుంది అని చెప్తున్నది. ఈ ఆనందం బ్రహ్మ పైనున్న ఆనందమయాది కోశాలన్నింటికీ ఆధారమై ఉన్నది. వాటిలో భాగంగానో, వాటికి భాగంగానో

కాదు. ఎక్కడ వాక్కులు కూడా ఆగిపోతాయో అని జ్ఞానులకు నిర్దేశించిన బ్రహ్మప్రాప్తిఫలం ఇదే.

ప్రశ్న: బ్రహ్మను చెప్తున్నప్పుడు పుంలింగం వాడరాదు కదా?

జవాబు: తప్పేం లేదు. అన్ని రకాలుగా చెప్తూ ఉంటుంది.

ఆనన్దమయోఽభ్యాసాత్। వేదం ఆనన్దమయాన్ని అభ్యాసంగా చెప్పట్లేదు. ఆనందం గురించి పదేపదే చెప్తుంది. 'అసన్నేవ స భవతి' అని ఇది సరిగ్గా అర్థం చేసుకోనివాడు అసత్ అయిపోతాడని కూడా చెప్పింది.

వికారశబ్దాన్నేతి చేన్న ప్రాచుర్యాత్। వికారార్థంలో కాదు, ప్రాచుర్యార్థంలో చూసుకోమంటే అవయవాలని అర్థం చేసుకోనక్కరలేదు. ప్రాయంగా కూడా తీసుకోవచ్చు అని చెప్పవలసి ఉన్నది.

తద్ధేతువ్యపదేశాచ్చ। ఆనన్దమయంతో సహా బ్రహ్మ అన్నింటికీ కారణం అని చెప్పుకోవాలి.

మిగిలిన సూత్రాలకు కూడా ఎక్కడెక్కడ సందేహాలు కలుగుతాయో అక్కడక్కడా జాగ్రత్తగా బ్రహ్మప్రతిపాదకాలు చూపిస్తూ ఉండాలి.